# జీవితం

"మీ వివేకానంద్‌కు యాక్సిడెంట్ అయింది. తెలుసా?".

యథాలాపంగా శ్రీమతి చెప్పేసరికి చదువుతున్న పేపరును పక్కకు పడేశాను; ఆశ్చర్యంగా చూశాను.

"యాక్సిడెంటా? ఎవరు చెప్పారు?"

"ఎవరో భావానందంట – ఓ నెల కిందట వచ్చి మీరున్నారేమోనని చూసి పోయాడు."

"మరి ఇపుడా చెప్పడం?" పంకజం మీద కోపం వచ్చింది.

"నాకేం తెలుసు? వాళ్ళు మీకు ఉత్తరం రాశారనుకున్నాను."

"మైనరా? మేజరా? ఎలా ఉందిట?"

"డిశ్చార్జి అయ్యేదాకా ఏం చెప్పలేమన్నాడు." చాలా మామూలుగా చెబుతూంటే నాకు మండింది.

వివేకానంద్ నాకు మంచి మిత్రుడు. మేము తరచుగా ఇంటి దగ్గర కలుసుకోకపోయినా కలుసుకున్నప్పుడు అన్ని విషయాలూ మాట్లాడుకుని స్నేహ మాధుర్యాన్ని అనుభవిస్తాం. కొత్తగా వచ్చిన ప్రమోషన్‌తో నేను మద్రాసు నుంచి కర్నూలుకు నెలకో సారి తిరుగుతున్నాను. ఫామిలీ షిఫ్టు చేద్దామంటే పిల్లల చదువులు అడ్డం వచ్చాయి. ఒక్క రోజు సెలవులో ఇంటికొచ్చినప్పుడు ఇంటి పనులకే టైం చాలడం లేదు. అందుకని మిత్రుల్ని కలుసుకోవడం బాగా తగ్గించాను.

"ఏ డాక్టరు – ఎక్కడ చేర్చారో గుర్తుందా?"

"ఇంటెన్సివ్ కేర్ అన్నట్టు గుర్తు. మెడికో లీగల్ కేసట – జనరల్ హాస్పిటల్‌లోనే." మాఆవిడకు జ్ఞాపకశక్తి ఎక్కువ. ఎటొచ్చి ఆవిడకు నాకూ – నా మిత్రులకూ సంబంధించిన విషయాలు అంత ముఖ్యమైనవిగా తోచవు. చాలా తేలిగ్గా తీసుకుంటుంది.

గబగబా డ్రెస్ చేసుకుని బయలుదేరాను. తీరా బయలుదేరి తరువాత అనుమానం వచ్చింది – ఇంకా అక్కడే ఉంటాడా, లేక కోలుకొని ఇంటికి పోయుంటాడా అని. దారిలోనే కాబట్టి ముందు హాస్పిటల్‌లో చూసిపోవడం మంచి దనిపించింది.

ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో వాకబు చేస్తే అతన్ని స్పెషల్ వార్డుకు మార్చారని తెలిసింది.

ఆ రూములోకి అడుగు పెట్టిన నేను షాక్ తిన్నాను.

మంచం పైన ఓ ఆకారం దుప్పట్లో దూరి ఉంది. తల కింకా బాండేజ్ ఉంది. సెలైన్ బాటిల్ స్టాండ్‌కు – దాని తాలూకు సూది అతని నరంలోకి అమర్చి ఉంది.

వివేకానందం అతనే అంటే – కొంచెం పోలిక కష్టం!

కుర్చీలో కూర్చుని పుస్తకం తిరగేస్తున్న వయసులో ఉన్న అమ్మాయి లేచి నిలబడింది. ఆమె ఎవరో నాకు గుర్తు రాలేదు.

"ఎవరు కావాలండి ?" ఆమె అడిగింది.

"వివేకానందమూర్తి!" చెప్పాను.

"ఆఁ! వీరే! కూర్చోండి. ఏమవుతారు?"

"స్నేహితుడు – నా పేరు ప్రకాష్, మేలుకుని ఉన్నాడా?"

"ఆఁ! లేపుతాను." ఆమె వంగి అతని చెవిలో చెప్పింది.

బలహీనంగా కళ్ళు తెరిచాడు వివేకానంద్. నన్ను చూసిన ఆ కళ్ళు మెరిశాయి. కూర్చో మన్నట్లు సైగ చేశాడు. కూర్చున్నాను – కుర్చీ అతని తల దగ్గరకు లాక్కుంటూ.

"వివేక్! ఇప్పుడెలా ఉంది? బాగుందా?"

"ఆఁ! చాలామటుకు కోలుకున్నాను." నూతిలోంచి వస్తున్నట్లుంది స్వరం. "ఏం నువ్వు కనపడ్డం లేదేం?"

"నాకు తెలీదు – నీకు యాక్సిడెండ్ జరిగినట్లు."

"రెండు మూడుసార్లు నీ కోసం కబురు చేశాను."

నేను చాలా గిల్టీగా ఫీలయ్యాను.

"ఒంటి మీద స్పృహ లేనప్పుడు మీ పేరు కలవరించేవారు. అందరూ చూడ్డానికి వచ్చారు – మీరు తప్ప." చెప్పింది.

"చారులత!" చెప్పాడు.

"ఐ సీ – మీ కేమవుతారు?" చొరవగా అడిగాను.

ఆమె సిగ్గుపడింది. నాకర్థమైంది, కాబోయే శ్రీమతి అని.

"అన్నీ సవ్యంగా ఉంటే ఈపాటికి పెళ్ళి చేసుకుని ఉండాల్సింది. మధ్యలో ఈ యాక్సిడెంటు–" అతని కళ్ళంబడి నీళ్ళు వచ్చాయి.

"వివేక్! మీరు రెస్టు తీసుకోండి. ఎక్కువసేపు మాట్లాడకూడదు." ఆమె మందలించింది.

"అసలు ఎలా జరిగింది?" కుతూహలం చాలా చెడ్డది. అవతలి వాళ్ళు చనిపోయిన వాళ్ళకోసం ఏడుస్తున్నా – ఎలా పోయాడో చెప్పమని వేధించే వెధవ ఆసక్తి – నాలో మెండు.

"ఆయన కొత్త స్కూటరు కొన్నారు – పాతది అమ్మేసి." ఆమె చెప్పసాగింది. "అప్పటినుంచి ఈ కష్టాలు పాతదానికి ఒక్క యాక్సిడెంటూ కాలేదు."

నేను భయపడ్డాను – ఆమె సోది చెప్పు కొస్తుందని. అందుకని ఆమె మాటల్ని తుంచేస్తూ అడిగాను – "వివేక్ మంచి ఎక్స్‌పర్ట్ కదా డ్రైవింగ్‌లో?"

"ఆఁ! అందుకే ప్రాణాలు కాపాడుకున్నారు."

"ఒరే ప్రకాశ్! ఈ యాక్సిడెంట్ వలన నాకో సత్యం తెలిసిందిరా. మనం బండి నడుపుతున్నప్పుడు – మనం జాగ్రత్తగా ఉండి, జాగ్రత్తగా నడిపితే సరిపోదు. ఎదురుగా కాని, పక్కగా కాని వస్తున్నవాడు జాగ్రత్తగా నడుపుతున్నాడా, లేదా కూడా మనమే గమనించాలి అని" ఆయాసపడ్డాడు చెప్పి వివేకానంద.

"ఆ రోజు పిక్చరు మొదలవుతుందన్న హడావిడిలో కొంచెం ఎక్కువ స్పీడ్ పెట్టారు. రోడ్డు క్రాసింగ్ దగ్గర నేను చెయ్యి చూపిస్తున్నా ఎదురుగా వస్తున్న కుర్రాడు ఓవర్‌టేక్ చెయ్యబోయాడు సైకిలుతో. అంతే పాపం ఈయన సడన్ బ్రేకులు వేశారు. స్పీడు మీదుంది కాబట్టి – బ్రేకులు బాగా పడ్డా – బండి కొంచెం తిరిగి ఎదురుగా ఉన్న ఎలక్ట్రిక్ పోల్‌కు గుద్దుకుంది. ఆయన ఎగిరి ఫుట్‌పాత్ మీద పడ్డారు. అదృష్టం కొద్దీ నేను దెబ్బలు తప్పించుకుని బయట పడగలిగాను." చారులత చెప్పింది.

నాకర్థమైంది – ఆ మహాతల్లి సిన్మాకు పోదామంటే పిచ్చివెధవ బయలుదేరి ఉంటాడు. ఆమెకు ఫ్యామిలీతో సహా సిన్మా చూసే అలవాటు ఉండి ఉంటుంది. అందుకని తొందరగా పోనియ్యమని తొందరించి

ఉంటుంది. అసలే కుర్రకారు – ఆ పైన కుర్రది వెనకాల చేరి తొందర చేస్తున్నది. ఆ పైన సైకిలుమీద రాకెట్ వేగంలో పోయే కుర్రాడు రాంగ్ సైడ్ ఓవర్‌టేక్ చేయడంవ్వ్!

"వివేకానందా! టౌనులో ఎంత స్పీడులలో పోతే మాత్రం ఎంత సమయం ఆదా చేయగలవురా? ఎటు చూసినా రెండు కిలోమీటర్ల కంటే దూరం ఉండదు. అటువంటప్పుడు ఎంత స్పీడులో పోయినా ఒక్క నిముషం కంటే తేడా రాదు. దాని కోసం ఇలా ప్రాణం మీదికి తెచ్చుకోవడం ఎంతవరకు సమంజసం?" ఆవేదనగా ప్రశ్నించాను. "నిదానమే ప్రధానం."

శుష్క మందహాసం చేశాడు. 'కాలం విలువైనదే కాని జీవితం అంతకంటే...' అన్న సూత్రం తెలియకా – ఆ టైమ్ అలా కలిసివచ్చింది – అన్న భావన ఆ నవ్వులో తొంగిచూసింది.

"స్కూటర్‌కు బాగా దెబ్బలు తగిలాయి. ప్రస్తుతం అది మెకానిక్ దగ్గరుంది." కిసుక్కున నవ్వింది చారులత.

"రోజుల్లా ఇక్కడే ఉంటున్నారా?" నే నడిగాను.

"అమ్మో! ఇంకేమన్నా ఉందా ఇంట్లో తెలిస్తే? క్లాసులు ఎగ్గొట్టి అప్పుడప్పుడు వస్తుంటాను." చెప్పింది.

"తెలిస్తే ఏం? ఎలాగూ పెళ్ళి చేసుకోబోతున్నారుగా." చిలిపిగా అన్నాను. ఆమె కొంచెం ఇబ్బంది పడినట్లు కనిపించింది.

"మాంసం తింటామని – మెళ్ళో ఎముకలేసుకుని తిరగంగా."

"సరే వివేక్ ! నే సెలవు తీసుకుంటాను. నువ్వు మటుకు స్కూటర్ ఎక్కమాకు – అమ్మిపారెయ్యి. చారులతగారూ, మావాడిని బాగా చూసుకోండి వస్తా."

"వస్తూ ఉండండి." ఆమె చెప్పింది.

"ప్రకాష్! అంతా బాగున్నారా?" చెయ్యి అలవోకగా ఎత్తి అడిగాడు.

నేను సిగ్గుపడ్డాను. ఆ ప్రశ్న నేను అడగాల్సింది. తలూపాను. మనసంతా అదో రకంగా ఉంది. ఆ యాక్సిడెంటు చూస్తే జీవితంలో స్కూటర్ నడపకూడదనిపించింది. అయినా ఈ సైకిల్ కుర్రాళ్ళు మరీను. పేరుకు సైకిలయినా – దాన్ని స్కూటర్ కంటే వేగంగా గంటకు అరవై కిలోమీటర్ల వేగంతో తొక్కుకుంటూ వస్తారు. ఇంతకూ బెల్లు ఉండదు, బ్రేకు ఉండదు . ట్రాఫిక్ రూల్సు పాటించరు.

ఓసారి కాలేజీలో చదివేప్పుడు నా దారిన నే పోతుంటే ఓ సైకిల్ పిల్లకాయ వెనకనుంచి వచ్చికొట్టాడు. రోడ్డు మీద బోర్లా పడ్డాను. పది మందీ వచ్చి లేవదీశారు.

"బ్రేక్ లేకపోతే కనీసం బెల్లన్నా కొట్టచ్చుగా?" కోప్పడ్డా.

అప్పుడు చూశాను ఆ సైకిల్‌కు బెల్లు లేదు. ఉన్నా అతను కొట్టే పరిస్థితిలో లేడు. ఒకచేతిలో కారియర్ – ఇంకో చేతిలో ఏదో పొట్లం.

ఆ పడ్డ దెబ్బకు వారం రోజులు హాస్పిటల్లో ఉండాల్సి వచ్చింది. అప్పటి నుంచి సైకిల్‌వాలాలంటే భయం. రోడ్డు మీద నడుస్తున్నప్పుడు చాలా జాగ్రత్తగా నడుస్తాను.

ఈసారి ఆడిట్ తగలడం వలన మద్రాసు నుంచి వచ్చేదానికి రెండు నెలలు పట్టింది.

ఇంట్లో కొంచెం వాతావరణం శాంతించిన తరువాత మనసులో అణచి పెట్టుకున్న కుతూహలాన్ని బయటకు లాగాను నా శ్రీమతిని దగ్గరికి పిలిచి – "ఏమోయ్! మా వివేకానందమూర్తి గురించి ఏమన్నా తెలిసిందా? పాపం నేచూసినప్పుడు ఇంకా కోలుకోలేదు."

"ఆఁ! బాగానే ఉన్నాట్ట. ఆఫీసుకు కూడా వెళుతున్నాట్ట. మరిచిపోయాను మీకో శుభలేఖ

వచ్చింది." అంటూ లోపలి నుంచి వెతికి ఓ శుభలేఖ తెచ్చి ఇచ్చింది.

చూసి కొయ్యబారిపోయాను.

చారులతకు శంకరంగాడితో పెళ్ళి!

శంకరం నాకు స్నేహితుడు. అతను పంపిన కార్డు అది. తేదీ చూశాను - పెళ్ళి అయిపోయి పదిహేను రోజులైపోయింది. నా మనసు ఉరుకులాడింది - చారులత వివేకానందమూర్తిని గాఢంగా ప్రేమించింది, వాళ్ళ పెళ్ళి కూడా ఫిక్స్ అయినట్లుంది ఈ లోపు యాక్సిడెంట్ జరిగింది లేకపోతే -!

శంకరం గాడిల్లు మా ఇంటికి దగ్గరే. వాడిని పలకరిద్దామని బయలుదేరాను. తలుపు దగ్గరగా వేసి ఉంది. కాలింగ్ బెల్ నొక్కాను. తలుపు తెరుచుకుంది. ఓ పూబోణి బయటకు వచ్చింది. పోల్చుకోలేకపోయాను - ఈ లోపే ఆమె నన్ను చూసి నవ్వింది - "శంకరంగారి కోసమా? బయటకు వెళ్ళారు. రండి కూర్చోండి." ఒక్క క్షణం సంశయించాను. తర్వాత లోపలికిపోయి కూర్చున్నాను.

చారులత లోపలికి వెళ్ళిపోయింది. ఆమె మొహంలో నా కేమీ కలవరపాటు కనపడలేదు.

"కాఫీ తీసుకోండి." లోపలి నుంచి కాఫీ కప్పుతో వచ్చింది.

"ఇప్పుడే తాగి బయలుదేరాను," చెప్పాను.

"అంతేనా? నా చేతి కాఫీ తీసుకోకూడదని ప్రతిన పూనారా?"

ఆ మాటతో కాఫీ కప్పు అందుకున్నాను. కొన్ని క్షణాలు నిశ్శబ్దంగా దొర్లాయి. ధైర్యం చేశాను.

"చారులతగారూ! ఏమీ అనుకోకపోతే ఓ ప్రశ్న."

"తెలుసు! వివేకానందమూర్తిగార్ని చేసుకోకుండా శంకరం గారిని ఎందుకు చేసుకున్నారనా?" సూటిగా అడిగింది.

నే తల తాటించాను - కొంచెం ఆశ్చర్యపోయాను.

"మీకో చెల్లెలుంటే ఆమెను కుంటివాడికిచ్చి పెళ్ళి చేస్తారా?"

"చెయ్యను. కానీ మీకు ముందే నిశ్చయమైందిగా."

"అయితే ఏం? పెళ్ళి కూడా పది కాలాల పాటు నిలవని రోజులు. సానుభూతితో ముందు చేసుకున్నా - తర్వాత జీవితం దుర్భరమవుతుందని మా వాళ్ళు చెప్పారు. నాకూ నిజమనిపించింది. వివేకానందమూర్తిగారు మునుపటి మూర్తిగాదు. కాలు సరిగా సెట్ కాలేదు. మునుపటి ఆరోగ్యం లేదు. ఇంకా ...." చెప్పబోయింది.

నాకు ఒళ్ళు మండిపోయింది. గట్టిగా అరిచేశాను - "ఆ యాక్సిడెంట్‌లో మీకే అలా జరిగి వివేకానందమూర్తి మీరున్న పరిస్థితుల్లో ఉంటే మీకెలా అనిపించేది?"

"ఇది జీవితం! జరిగినదానికీ జరుగుతుందని ఊహించుకోవడానికీ చాలా తేడా ఉంది." కన్నీళ్ళను ఆపుకుంటూ చెప్పింది.

హఠాత్తుగా లేచి బయటకు వచ్చేశాను మనసు వికలమై.

ఆలోచనల్లో నడుస్తున్న నేను ఎవరో పిలిచినట్లనిపిస్తే వెనక్కి తిరిగి చూశాను వివేకానందమూర్తి స్కూటర్ స్టాండ్ వేస్తున్నాడు. నన్ను చూసి ఆగినట్లున్నాడుకుంటి కాలుతో దగ్గరికి వస్తున్నాడు.

"హలో ! వివేక్! ఆరోగ్యం బాగుందా? జాయినయ్యావా?"

"ఆ! ఎప్పుడొచ్చావు ఊర్నించి? నిన్ను కలుద్దామనే పోతున్నాను." ఏమీ జరగనట్లు అతను

మాట్లాడుతుంటే జాలి కలిగింది.

"సారీ! చారులత ఇలా మోసం చేస్తుందని అనుకోలేదు."

"తనేం చేసింది? తెలివిగలది. ఇది జీవితం బ్రదర్! పాము నిచ్చెనల ఆట! - ఒక్క క్షణం చాలు అధః పాతాళంలోకి పోవడానికి! జీవితం విలువ తెలుసుకుని తెలివిగా జీవితాన్ని మలుచుకుంది." నిర్వికారంగా, నిశ్చలంగా చెప్పాడు వివేకానందమూర్తి.

"అవును. వివేక్. ఇక ఈ జన్మకు స్కూటర్ నడపననుకున్నాను. ఆశ్చర్యం! కనీసం ఆ స్కూటర్ అమ్మను కూడా అమ్మకుండా, చావు తప్పి కన్ను లొట్టబోయినా దాంతోనే తిరుగుతున్నావు?"

"నడుస్తున్నప్పుడు యాక్సిడెంట్ అయిందని నువ్వు నడక మానేశావా?"

నవ్వుతూ వాడడిగిన ప్రశ్న నా గుండెల్లో బాకులా చొరబడింది. ★

(ఆంధ్ర ప్రభ వార పత్రిక)

